## కానిస్టేబుల్ నిజాయతీ



భవానీపురం(విజయవాడపశ్చిమ): నగదు, విలువైన పత్రాలు ఉన్న పర్సు పోగొట్టుకున్న వ్యక్తికి వాటిని తిరిగి అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు ఓ పోలీస్ కానిస్టేబుల్. విద్యాధరపురం కబేళా సెంటర్‌లో నివసిస్తున్న కానిస్టేబుల్ వల్లభాపురం చందు (పీసీ నంబర్ 346) అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం విధులకు వెళ్తుండగా సితార జంక్షన్‌లో పర్సు దొరికింది. అందులో రూ.16,500 నగదు, ఆధార్, పాన్ కార్డ్‌తోపాటు హెల్త్ డాక్యుమెంట్స్ ఉన్నాయి. అతను కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. పర్సు పోగొట్టుకున్న పెండ్యాల సత్యనారాయణకు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితుడు సత్యనారాయణ రైల్వే విశ్రాంత ఇంజినీర్ అని, ఆయన సీవీఆర్ ఫ్లై ఓవర్ సర్వీస్ రోడ్డులోని తోట నాగేశ్వరరావు వీధిలో నివసిస్తున్నారని తెలిసింది. ఆయన్ను భవానీపురం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఎస్ఐ ప్రకాష్ సమక్షంలో సత్యనారాయణకు పర్సు అప్పగించారు. చందును పోలీసులు అభినందించారు.



# సర్వం శివమయం



సహస్ర లింగార్చన అనంతరం విశేష అలంకారం



ప్రత్యేక బిల్వార్చనలో ఆలయ అర్చకులు

- 'కార్తిక ఏకాదశి' విశేష పూజలు
- సహస్ర లింగార్చన, బిల్వార్చనలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సర్వం శివమయంగా మారింది. కార్తిక ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి వారికి పంచామృత అభిషేకాలు, అర్చనలు, సహస్ర లింగార్చనలు జరిగాయి. తెల్లవారుజామున 5 గంటల నుంచి సాయంత్రం వరకు స్వామివారికి భక్తులు పంచామృతాలతో అభిషేకాలు జరిపించుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం కనిపించింది. రద్దీ నేపథ్యంలో ప్రత్యేకంగా క్యూలు ఏర్పాటు చేశారు. స్వామివారి దర్శనానంతరం భక్తులు ఆలయ ధ్వజస్తంభం వద్ద దీపారాధనలు చేశారు. మధ్యాహ్నం మల్లేశ్వరస్వామికి ప్రత్యేక బిల్వార్చనను ఆలయ అర్చకులు నిర్వహించారు. ప్రధాన ఆలయంలో మూలవిరాట్‌కు బిల్వార్చన జరిగింది. సాయంత్రం సహస్ర లింగార్చనకు పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ చేశారు. శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల ఉత్సవ మూర్తులకు దీపార్చన సేవ, ఊంజల్ సేవ నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ఆలయ వైదిక కమిటీ పర్యవేక్షించగా, ఈవో కె.ఎస్. రామరావు దంపతులు పాల్గొన్నారు. అనంతరం మల్లేశ్వర స్వామి వారి ఆలయం, రాజగోపురం ఎదుట భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది.

## అన్నక్యాంటీన్లలో మెరుగైన వసతులు కల్పించండి



మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ పరిధిలో ఆయా డివిజన్లలోని అన్నక్యాంటీన్లలో ప్రజలకు మెరుగైన వసతులు కల్పించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. మంగళవారం వీఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి ఆయన అన్నక్యాంటీన్ నోడల్ ఆఫీసర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరపాలక సంస్థ పరిధిలోని 11 అన్న క్యాంటీన్లకు 11 మంది నోడల్ ఆఫీసర్ల నియామకం జరిగిందని తెలిపారు. రోజూ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు 11 వార్డ్ వెల్ఫేర్ / ఏమినిటీస్ సెక్రటరీలను, మధ్యాహ్నం మూడు నుంచి రాత్రి 9 గంటల వరకు మరో 11 వార్డ్ వెల్ఫేర్ / ఏమినిటీస్ సెక్రటరీలను అన్న క్యాంటీన్ల నిర్వహణ, పర్యవేక్షణకు నియామకం జరిగిందని చెప్పారు. అన్నక్యాంటీన్లో ప్రజలకు అసౌకర్యం కలగకుండా నోడల్ ఆఫీసర్లు చర్యలు తీసుకోవాలని, ప్రతిరోజూ మూడు పూట్లా ఇచ్చే టోకెన్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని తెలిపారు. కిచెన్‌లో పరిశుభ్రత, భోజనంలో నాణ్యత, తాగు నీటి సరఫరా, వాడుక నీరు సరఫరా, పారుదల, మరుగుదొడ్ల నిర్వహణలో అశ్రద్ధ చూపొద్దని ఆదేశించారు.

## 'సిప్ అబాకస్'కు పశ్చిమ విద్యార్థులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన సిప్ అబాకస్ ఇండియ ఇటీవల కోల్‌కతాలో నిర్వహించిన బిశ్వ బంగ్లా మేళాకు పశ్చిమలోని వన్‌టౌన్, భవానీపురం అబాకస్ విద్యార్థులు హాజరయ్యారు. 21వ అంతర్జాతీయ సిప్ అబాకస్ అండ్ మెంటల్ అర్థమెటిక్ కాంటెస్ట్‌లో 11 దేశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అందులో సిప్ అబాకస్ భవానీపురం, వన్‌టౌన్ బ్రాంచిల నుంచి 12 మంది విద్యార్థులు హాజరుకాగా వారిలో 11 మంది వివిధ స్థాయిల్లో ట్రోఫీలు సాధించినట్లు హెడ్ మధుసూదనరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రోఫీలు పొందినవారిలో కె. సాయి, జెస్సిక, నోయల్ శామ్యూల్, ఎం హృదయ్ సిద్ధిఖ్, ఎం.బృంద, షేక్ హనీఫ్, కె. శ్రీహర్ష, కె.విహాన్, సీహెచ్ జగదీశ్వర్, ఎన్. దీక్షిత, ఆర్.ప్రభాస్ ఉన్నారని పేర్కొన్నారు.. విద్యలవాడగా ప్రసిద్ధి చెందిన విజయవాడకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడం గర్వకారణంగా ఉందన్నారు. ఇటువంటి పోటీ పరీక్షలు విద్యార్థుల ప్రతిభకు మరింత మెరుగు పెట్టుకునేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. సిప్ అబాకస్ మేనేజింగ్ డైరెక్టర్ దినేష్ విక్టర్, వివిధ రాష్ట్రాల ఇన్‌చార్జిలు, ఫ్రాంచైజీలు, ఉపాధ్యాయలు పాల్గొన్నట్లు చెప్పారు.

# దుర్గా కోఆపరేటివ్ బ్యాంక్ లైసెన్స్ రద్దు

- ఆర్‌బీఐ ఆదేశాలు
- తదుపరి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సహకార రిజిస్ట్రార్‌కు ఆదేశాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీ కేంద్రంగా సుదీర్ఘ కాలం నుంచి పని చేస్తున్న దుర్గా కోఆపరేటివ్ బ్యాంక్ వ్యాపార లైసెన్స్‌ను రద్దు చేస్తున్నట్లుగా ఆర్‌బీఐ ఒక ప్రకటనలో తెలిపింది. నవంబర్ 12వ తేదీ వ్యాపారం ముగిసే సమయానికి బ్యాంక్ వ్యాపారాన్ని నిలిపివేస్తుందంటూ అందులో పేర్కొంది. తదుపరి చర్యలు తీసుకోవాలని ఏపీ సహకార కమిషనర్, రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీకి సూచించింది. బ్యాంక్‌లో ఐదు లక్షల మేర డిపాజిట్ చేసిన వారికి ఇన్సూరెన్స్ క్లెయిమ్ నుంచి పొందడానికి అర్హులని పేర్కొంది. డిపాజిట్‌దార్లలో సుమారు 95.8 శాతం తిరిగి పొందడానికి అర్హులుగా ఉన్నారని తెలిపింది. ఆగస్టు మాసాంతంలో రూ.9.84 కోట్ల మేర డిపాజిట్‌దారులకు చెల్లించినట్లు పేర్కొంది. బ్యాంక్‌కు తగిన మూలధనం, ఆదాయ అవకాశాలు లేకపోవడంతో లైసెన్స్ రద్దు నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని ఆర్‌బీఐ పేర్కొంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో బ్యాంక్ డిపాజిట్‌దారులకు పూర్తిగా చెల్లించే పరిస్థితులు లేవని, ఖాతాదారులకు ప్రతికూల పరిస్థితులు తలెత్తే అవకాశముందని పేర్కొంది. దీంతో ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌బీఐ వివరించింది.

## 17న శారదా సదనం, ధార్మిక భవనం ప్రారంభం

- ప్రారంభించనున్న విధుశేఖర భారతి
- నగరంలో నాలుగు రోజులపాటు బస
- ప్రతిరోజూ అనుగ్రహ భాషణ



శృంగేరీ జగద్గురు పీఠ ఉత్తరాధికారి విధుశేఖర భారతి పర్యటన వివరాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

విజయవాడ కల్చరల్: శివరామ కృష్ణ క్షేత్రంలో పునర్నిర్మితమైన నూతన భవన సముదాయం శారదా సదనం, ధార్మిక భవన సముదాయాన్ని ఈనెల 17 వ తేదీ ఆదివారం సాయంత్రం శృంగేరీ శారదా పీఠం(కర్నాటక) ఉత్తరాధికారి విధుశేఖర భారతి ప్రారంభిస్తారని శివరామకృష్ణ క్షేత్రం ధర్మాధికారి శిష్ట్లా హనుమత్ ప్రసాద్ తెలిపారు. శివరామకృష్ణ క్షేత్రంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. శివరామకృష్ణ క్షేత్రంలో 17 వ తేదీ నుంచి నాలుగు రోజులపాటు స్వామి విజయయాత్ర చేస్తారని, ఈ సందర్భంగా ధార్మిక భవనాలను ప్రారంభిస్తారని చెప్పారు. రోజూ భక్తులకు అనుగ్రహ భాషణ చేస్తారని తెలిపారు. 18 వ తేదీ సత్యనారాయణపురంలోని పాదుకా క్షేత్రం, మారుతీ వ్యాయామశాలను దర్శిస్తారని, యనమలకుదురులోని శివాలయంలో జరిగే కుంభాభిషేకంలో పాల్గొంటారని, రాత్రి 7 గంటలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వామిజీని కలుస్తారన్నారు. 19 వ తేదీ దుర్గామల్లేశ్వర స్వామి వారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని, 20 వ తేదీ ఉదయం శివరామకృష్ణ క్షేత్రం దేవాలయ సముదాయంలో కుంభాభిషేకం కార్యక్రమం నిర్వహిస్తారని వివరించారు. పూజల అనంతరం స్వామి నరసరావుపేట వెళతారని వివరించారు. సమావేశంలో కార్యక్రమ నిర్వాహకులు గండూరి చంద్రమౌళి, జొన్నవిత్తుల ప్రభాకర శాస్త్రి, గండూరి రమా సత్యనారాయణ పాల్గొన్నారు. బ్రోచర్‌ను అతిథులు ఆవిష్కరించారు.

## • అలెక్సా.. వీధి వెలుగులెక్కడమ్మా..



కనకదుర్గ ఫ్లైఓవర్‌పై, సర్వీస్ రోడ్డులో వెలగని వీధి దీపాలు



కృష్ణలంక జాతీయ రహదారి ఫ్లై ఓవర్‌పై చీకట్లే

సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో విజనరీ బాబుగారు చేసిన ప్రచారం గుర్తుందా..
'నా విజనరీతో రాష్ట్రంలో ఎక్కడ సమస్యలు, ప్రజలకు ఇబ్బందులు ఉన్నా అలెక్సా అనే యాప్ ద్వారా వారి కష్టాలు తెలుసుకుని వాటిని తీర్చడానికి ముందుకు సాగుతాం.. ఉదాహరణకు మీ వీధిలో ఎక్కడైనా లైట్లు వెలగకపోతే నేను ఇక్కడ నుంచి అలెక్సా ద్వారా మీ వీధిలో లైట్లు వెలుగుతున్నాయో లేదో చూసి పరిష్కరిస్తా' అని చెప్పారు. నగరంలో చాలాచోట్ల వీధి వెలుగులు కానరావడం లేదు. దీంతో అలెక్సా అడ్రస్ కోసం నగరవాసులు వెతుకున్నారు సార్.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

## బాధితులను ఆదుకోవడంలో ముందంజ

జిల్లా లయన్స్ క్లబ్ గవర్నర్ గద్దె శేషగిరి



కిట్‌లను పంపిణీ చేస్తున్న శేషగిరి

ఆటోనగర్(విజయవాడతూర్పు): లయన్స్ క్లబ్ ఆపదలో ఉన్నవారికి ఎల్లప్పుడూ ఆపన్న హస్తం అందిస్తుందని జిల్లా ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ గవర్నర్ గద్దె శేషగిరి అన్నారు. మంగళవారం వన్‌టౌన్ చిట్టినగర్ పాలఫ్యాక్టరీ చుట్టుపక్కల ఉన్న కుటుంబాలకు 100 మందికి నిత్యావసరాలు, వంటపాత్రలు, మందులతో పాటు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శేషగిరి మాట్లాడుతూ విజయవాడలో రెండు నెలల క్రితం పెను విపత్తు సంభవించడం బాధాకరమన్నారు. చాలా కుటుంబాలు నిరాశ్రయులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరందరినీ ఆదుకోలేకపోయినా మా వంతుగా సుమారు 800 కుటుంబాలకు పైగా ఇప్పటి వరకు సహాయ సహకారాలు అందించినట్టు చెప్పారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ అధ్వర్యంలో ఎమర్జెన్సీ గ్రాంట్ 10 వేల డాలర్లు వచ్చినట్టు తెలిపారు. ఈ మొత్తాన్ని ఆపదలో ఉన్నవారికి ఇస్తున్నామని చెప్పారు. ఇవి కాకుండా లయన్స్ క్లబ్ అన్ని ప్రాంతాల్లోని పేదవారికి ఉచితంగా వైద్యశిబిరాలు. పేద విద్యార్థులు, మహిళలకు పలు సేవలతోపాటు ఆర్థిక సహకారం అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ పీడీసీ మిరియాల వెంకటేశ్వరరావు, డెప్యూటీ క్యాబినెట్ సెక్రటరీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సుంకర కృష్ణ, ప్రోగ్రాం కమిటీ చైర్‌పర్సన్ గునుకుల పుల్లయ్య, ఉపాధ్యక్షులు బండి రామ్మోహనరావు పాల్గొన్నారు.

## నేత్రపర్వంగా సాగిన కూచిపూడి నృత్యాలు



సంప్రదాయ నృత్యాలు చేస్తున్న చిన్నారులు

విజయవాడ కల్చరల్: అరుణోదయ కళాసమితి ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో చిన్నారులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. స్వాగతనృత్యం, జతిస్వరం, గణేషవందనం, ఆయగిరి నందిని, జయము జయము, లలితా కళావాహిని అష్టలక్ష్మీ స్తోత్రం అంశాలను ప్రదర్శించారు. నృత్యకార్యక్రమంలో చక్రిక, పేర్ని జస్మిత, నివేది, తన్విత తేజశ్రీతో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని కళాకారులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా తెలుగు అధ్యాపకురాలు కరణం రమాదేవి పాల్గొన్నారు. కార్యక్రమంలో అరుణోదయ కళా సమితి కార్యదర్శి మాధురి, కోశాధికారి పార్వతి, శమీష సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బాలసుబ్రహ్మణ్యంను స్ఫూర్తిగా తీసుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ అధ్యాపకుని అవార్డు గ్రహీత డాక్టర్ వెంకట సూర్య బాలసుబ్రహ్మణ్యంను అధ్యాపకులు ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని మరింత మెరుగైన విద్యాబోధన చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి సూచించారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుని అవార్డు గ్రహీత డాక్టర్ వెంకట సూర్య బాలసుబ్రహ్మణ్యం అభినందన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని బాలసుబ్రహ్మణ్యం సేవలను కొనియాడారు. ఆయన అందించిన సేవలకు గుర్తింపు ఈ పురస్కారం.. అన్నారు. పురస్కార గ్రహీత డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఈ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందన్నారు

## శ్రీ బాలాత్రిపురసుందరిగా భ్రమరాంబదేవి




వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని పురాతన ఆలయం పాతశివాలయంలో భ్రమరాంబ అమ్మవారు మంగళవారం శ్రీ బాలాత్రిపురసుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో కార్తిక మాసాన్ని పురస్కరించుకొని కార్తిక నక్షత్రదీక్షా మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయంలో పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. అమ్మవారిని శ్రీ బాలాత్రిపురసుందరీదేవిగా అలంకరించారు. ప్రత్యేక అలంకారంలో అమ్మవారికి త్రిశతి ఖడ్గమాల, సహస్రనామార్చన, శ్రీ మల్లేశ్వరస్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహాలింగార్చన, ఆలయ ప్రదక్షిణలు, పంచహారతులు అనంతరం చతుర్వేద స్వస్తి, ఆశీర్వచనం తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. అయ్యప్పస్వామి సన్నిధిలో దీక్షాధారులకు అన్నదానం చేశారు.

## 15 నుంచి యల్లాజోస్యుల నృత్యోత్సవాలు

విజయవాడ కల్చరల్: శ్రీ కనక దుర్గా నృత్యమందిర్ ఆధ్వర్యంలో 15 వ తేదీ శుక్రవారం నుంచి మూడు రోజులపాటు యల్లాజోస్యుల రామకృష్ణ కూచిపూడి నృత్యోత్సవాలను సంగీత కళాశాలలో సాయంత్రం 6 గంటలకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు యల్లాజోస్యుల అనూరాధ, నేతి విద్యాసాగర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 వ తేదీ వినాయక చవితి, 16న అన్నమయ్య తత్వం, 17న స్వామియే శరణమయ్యప్ప నృత్యరూపకాలను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా, ఎన్‌సీహెచ్ బుచ్చయ్యాచార్యులు, డాక్టర్ పీవీఎస్ కృష్ణ పాల్గొంటారని తెలిపారు.

## విలేజి కండ్రికలో తాగునీటి పరీక్షలు



పాయకాపురం(విజయవాడ రూరల్): వీఎంసీ సరఫరా చేస్తున్న తాగునీరు రంగు మారి వస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం విలేజి కండ్రికలో తాగునీటి పరీక్షలు నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ, ప్రజల సమక్షంలో నీటి సరఫరా విభాగం ఏఈ మాధవ్ తాగునీటి పరీక్షలు నిర్వహించారు. ఈ నీటిలో ఎలాంటి తేడాలు లేవని క్లోరినేషన్ చేసిన తర్వాత తాగునీరు సరఫరా చేస్తున్నట్టు ఏఈ తెలిపారు.